RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శనివారం | 06 -01 - 2024
సంపుటి: 1 | సంచిక : 232 | పేజీలు : 4 | వెల : 5/-



## 100 ఎకరాల్లో హైకోర్టు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ కొత్త హైకోర్టు భవనానికి 100 ఎకరాల్లో భూమి కేటాయింపు జరిగింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్, ప్రేమావతిపేటలోని స్థలం మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో 55 జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఆదేశాలిచ్చింది. గత నెలలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే,

మిగతా 2వ పేజీలో... 4లో




# కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ సాధ్యమేనా?

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు షెడ్యూల్ ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. 11వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 18వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 29వ తేదీన పోలింగ్ జరుగుతుంది. అదే రోజు కౌంటింగ్ జరుగుతుంది. నిజానికి తెలంగాణలో ఎమ్మెల్సీ ఖాళీలు లేవు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరి , పాడి కౌశిక్ రెడ్డి పోటీ చేసి గెలిచారు. వీరు అంతకు ముందే ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. దీంతో ఎమ్మెల్యేగా ప్రమాణం చేసే ముందు ఎమ్మెల్సీగా రాజీనామా చేశారు. వారి స్థానాల్లోకి కొత్త అభ్యర్థులను ఎన్నుకునేందుకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. రెండు స్థానాలకు నామినేషన్లు దాఖలైతే పోలింగ్ ఉండదు. ఏకగ్రీవం అవుతుంది. తెలంగాణలో 119 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కొక్కరికి 60 ఓట్లు వస్తే ఎమ్మెల్సీ అవుతారు. కానీ కాంగ్రెస్ పార్టీకి 65 మంది ఉన్నారు. బీఆర్ఎస్‌కు 39 మంది మాత్రమే ఉన్నారు. బీజేపీ, ఎంఐఎం ఒకే అభ్యర్థికి మద్దతిచ్చే అవకాశాలు ఉండవు. బలం తక్కువ అయినా రెండో స్థానం బీఆర్ఎస్ గెలుచుకోవచ్చు. కానీ .. కాంగ్రెస్ పార్టీ ఇద్దరు అభ్యర్థుల్ని నిలబెడితే మాత్రం.. పోరు ఆసక్తికరంగా మారుతుంది. బీఆర్ఎస్ పోటీ నుంచి వైదొలిగితే కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవం అవుతారు. బీఆర్ఎస్ పోటీ పెడితే.. మాత్రం ఎన్నిక రచ్చ అవుతుంది. కాంగ్రెస్ ఫిరాయింపులను ప్రోత్సహించే అవకాశం ఉంది.మరో ఎమ్మెల్యేగా గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి కూడా ఎమ్మెల్స పదవికి రాజీనామా చేశా- రు. ఆయన పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలిచారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ నియోజకవర్గంలో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన... ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఫలితంగా మండలిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కాస్త ఖాళీ అయ్యింది. 2021 మార్చి 14న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగగా... ఆ సమయంలో మొత్తంగా 76 మంది వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ పడగా.. ఇండిపెండెంట్ గా బరిలో నిలిచిన తీన్మార్ మల్లన్న టఫ్ ఫైట్ ఇచ్చారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, తీన్మార్ మల్లన్న మధ్య హోరాహోరీ పోరు నడవగా... చివరకు పల్లా విజేతగా నిలిచారు. ఆయన ఆ పదవిలో ఆరేళ్ల పాటు కొనసాగాల్సి ఉంది. కానీ తాజా ఎన్నికల్లో జనగామ నుంచి పోటీ చేసి గెలవడంతో ఆయన

మిగతా 2వ పేజీలో...

# ఢిల్లీలో బిజీబిజీగా రేవంత్



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తో భేటీ అయిన సీఎం.. రాష్ట్రానికి ఐపీఎస్ అధికారుల కేటాయింపును పెంచాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను సీఎంతో పాటు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి కలిశారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు కు జాతీయ హోదా ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. జిల్లాల విభజన, వివిధ శాఖల పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్రానికి అదనంగా 29 అదనపు ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తికి కేంద్ర మంత్రి అమిత్ షా సానుకూలంగా స్పందించారు. 2024లో కొత్తగా వచ్చే ఐపీఎస్ బ్యాచ్ నుంచి తెలంగాణకు అధికారులను అదనంగా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను రేవంత్‌రెడ్డి ఢిల్లీ నార్త్‌బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన పలు అంశాలను అమిత్ షా దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. రాష్ట్ర పునర్విభజన చట్టం తొమ్మిదో షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థల విభజనను పూర్తి చేయాలని, పదో షెడ్యూల్ పరిధిలోని సంస్థల వివాదాన్ని పరిష్కరించాలని, న్యూఢిల్లీలోని ఉమ్మడి రాష్ట్ర భవన్ విభజనను సాఫీగా పూర్తి చేయాలని, చట్టంలో ఎక్కడా పేర్కొనకుండా ఉన్న సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకోవడం విషయంపై దృష్టిసారించాలని కేంద్ర హోం శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ. 88 కోట్లు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ. 90 కోట్లు అదనంగా కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని

మిగతా 2వ పేజీలో...



## ఏసీబీ ట్రాప్‌లో కాకతీయ రిజిస్ట్రార్

**వరంగల్, ప్రభాతసూర్యుడు :** వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఏసీబీ ఉచ్చు కలకలం సృష్టించింది. చదువులకు కేంద్రమైన యూనివర్సిటీలోని హాస్టళ్లకు పాలు సరఫరా చేసే వ్యక్తి నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్ లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీకి సమాచారం అందించాడు. దీంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇవాళ ఉదయం లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ


మిగతా 2వ పేజీలో...

# విచారణ అంటే వణుకు ప్రారంభమైంది



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కాళేశ్వరంలో లోపాలపై న్యాయ విచారణ అనగానే మాజీ సీఎం కేసీఆర్ ఆయన తనయుడు, మంత్రి కేటీఆర్ (ఖుఫీ) లో వణుకు మొదలైందని మంత్రి కొండా సురేఖ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏండ్లలో అమలు చేయలేని కనీస అవసరాలను నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుంటే జీర్ణించుకోలేక కేటీఆర్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని అటవీ �santé పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కాళేశ్వరంపై న్యాయ విచారణ అనగానే.. బీఆర్ఎస్ అగ్రనేతల్లో, మాజీ మంత్రుల్లో వణుకు మొదలైందరి, అందులో ఎవరెవరి వాటా ఎంత? ప్రజాధనం ఎంత దుర్వినియోగమైందో కక్కించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇంకా నెల కూడా కాలేదు.. కనీసం 100 రోజులు సమయం ఇవ్వకుండా అప్పుడే 100 రోజుల్లో ప్రభుత్వం పడిపోతది అని మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ ఏమి మాట్లాడుతున్నారో కొంచె ఆలోచించి మాట్లాడితే బాగుంటది అని మంత్రి సురేఖ హితవు పలికారు. తొమ్మిదిన్నర సంవత్సరాల కాలం పాటు ప్రజల సొమ్మును దోచుకుని, అడ్డంగా బలిసి.. తెలంగాణ ప్రజల గురించి మాట్లాడే నైతిక హక్కును బీఆర్ఎస్ నేతలు కోల్పోయాని చెప్పారు. ఉద్యమకారులను అన్యాయంగా

మిగతా 3వ పేజీలో...



# లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ నజర్..

- బండి సంజయ్‌కు కీలక బాధ్యతలు..!
- కిసాన్ మోర్చా ఇంచార్జీగా నియామకం



**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** లోక్ సభ ఎన్నికలకు ప్రధాన పార్టీలు సన్నద్ధం అవుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ' అనే మరో యాత్రకు సిద్ధం అవుతున్నారు. తామేం తక్కువ కాదని అంటోంది అధికార భారతీయ జనతా పార్టీ. పార్టీ అంతర్గత కమిటీలను ప్రక్షాళన చేసింది. పలువురికి కీలక బాధ్యతలను అప్పగించింది. తెలంగాణ బీజేపీ మాజీ చీఫ్ బండి సంజయ్‌కు పెద్ద బాధ్యతను అప్పగించింది. గత వారం బీజేపీ ఆఫీస్ బేరర్లతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో వచ్చే ఎన్నికల కోసం చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించారు. బీజేపీలో వివిధ మోర్చాలకు కొత్త వారిని నియమించారు. కొత్త వారు వెంటనే బాధ్యతలు చేపడుతారని ప్రకటించారు. ప్రధాని మోదీ ఆదేశాలతో ఆ సమావేశం జరిగిందని తెలిసింది. వచ్చే ఎన్నికల్లో సీట్ల

మిగతా 2వ పేజీలో...

## ఫిబ్రవరి నుంచి మహాలక్ష్మీ పథకం

పథకం అమలుకు రేవంత్ సర్కారు కసరత్తు

3లో




## కాంగ్రెస్, ఎంఐఎం ఆధిపత్య పోరు

పాతబస్తీలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు

3లో



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ముక్కునూరులో అయ్యప్ప ఇరుముడి పూజ



**పాల్గొన్న యూత్ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం పరిధిలోని ముక్కునూరులో అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజ ఘనంగా జరిగింది. పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని ప్రజలందరికీ అయ్యప్ప స్వామి అనుగ్రహం, దీవెనలు, ఎల్లప్పుడూ ఉండాలని సుఖ, సంతోషాలతో, వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు రమేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంకాల కరుణాకర్, ముక్కునూరు గ్రామ అధ్యక్షుడు దొడ్డి కరుణాకర్, ఎం ఆర్ ఆర్ ఇబ్రహీం పట్నం మున్సిపల్ అధ్యక్షుడు చింతపట్ల కిరణ్, సల్మాన్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## డిప్యూటీ సీఎంను కలిసిన కొత్త కురుమ శివకుమార్

**తుర్కయంజాల్ - ప్రభాత సూర్యుడు :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో, ఘనంగా సన్మానించి పూల బొకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



**యాచారం - ప్రభాత సూర్యుడు:** యాచారం మండలం మాల్ మైసమ్మ గుడి సమీపంలో శుక్రవారం ఉదయం 9:20 గంటలకు రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొట్టడంతో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి క్రింద పడగా తలపై నుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నంది వనపర్తి గ్రామా నికి చెందిన రామ్ రెడ్డిగా గుర్తించారు. తదనంతరం పోస్టుమార్టంకు తరలించి సీఐ సైదయ్య కేసు నమోదు చేశారు.

## 100 ఎకరాల్లో హైకోర్టు

మొదటిపేజీ తరువాయి..

పలువురు హైకోర్టు న్యాయమూర్తులు ఎంసీహెచ్ఆర్డీలో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తది నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే నూతన హైకోర్టు నిర్మాణానికి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ సాధ్యమేనా?

మొదటిపేజీ తరువాయి..

రాజీనామా అనివార్యమైంది. ఈ నియోజకవర్గానికి చెందిన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించాల్సిందిగా ఆదేశించాలు ఇచ్చింది ఈసీ. ఓటరు నమోదు కోసం నిర్ణీత షెడ్యూల్‌ను వెల్లడించగా... ఓటర్ల నమోదు ప్రక్రియకు శనివారం పబ్లిక్ నోటీస్ జారీ చేసింది. ఫిబ్రవరి 6కల్లా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని... 24వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను వెల్లడించాలని పేర్కొంది. ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితాను ప్రకటించాలని స్పష్టం చేసింది. గవర్నర్ కోటాలోనూ రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి.






### వైస్ చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్ల తిరుగుబాటు

# తుర్కయంజల్ మున్సిపాలిటీలో ముసలం

**తుర్కయంజాల్ - ప్రభాత సూర్యుడు :** తుర్కయంజాల్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నాలుగు సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ మార్పు సాధ్యం అని అనిపిస్తుంది దీనికి సంబంధించి శుక్రవారం తుర్కయంజాల్లోని ఓ ఫామ్ హౌస్ లో 18మంది కౌన్సిలర్ లు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి హాజరైన 18 మంది కౌన్సిలర్స్ ఒకే తాటిపైకి వచ్చి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గా కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ ని ఎన్నుకునే సమాలోచనలో ఉన్నట్టు కనిపిస్తుంది. కొన్ని కారణాల వల్ల గైహాజరు అయిన 4 గురు కౌన్సిలర్ లు కూడా వారికే మద్దతుగా ఉన్నట్టు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు కాకుమాను సునీల్, ఫ్లోర్ లీడర్లు కోశిక ఐలయ్య,కళ్యాణ్ నాయక్, సునిల్, బాలప్ప, కంబాలపల్లి ధన్ రాజ్,బొక్క శ్రీలత గౌతమ్ రెడ్డి,కుంట ఉదయ్ శ్రీ గోపాల్ రెడ్డి,రొక్కం అనిత చంద్ర శేఖర్ రెడ్డి,వేముల స్వాతి అమరేందర్ రెడ్డి, పుల్లగుర్రం కీర్తన విజయనంద్ రెడ్డి, గుండా భాగ్యమ్మ ధన్ రాజ్, తాలపల్లి సంగీత మోహన్ గుప్తా, మర్రి మాధవి మహేందర్ రెడ్డి,మేతరీ అనురాధ దర్శన్, కొంద్రు మల్లేష్,కో - ఆప్షన్ సభ్యులు కాకుమాను చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో బిజీబిజీగా రేవంత్

మొదటిపేజీ తరువాయి..

రాజ్‌భవన్, హైకోర్టు భవనం, లోకాయుక్త, ఎస్‌హెచ్ఆర్సీ వంటి భవనాలను ఆంధ్రప్రదేశ్ వినియోగించుకున్నందున ఆ రాష్ట్రం నుంచి వడ్డీతో కలిపి మొత్తం రూ.408 కోట్లు ఇప్పించాలని కేంద్ర హోం శాఖ మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

హైదరాబాద్ మెట్రో రెండో దశ సవరించిన ప్రతిపాదనలు ఆమోదించండి

హైదరాబాద్ మెట్రో రెండో దశ సవరించిన ప్రతిపాదనలు ఆమోదించాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ&జప్తి చేశారు. కేంద్ర మంత్రిని గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ మెట్రో రెండో దశను (బీహెచ్ఈఎల్-లక్డీకాపూల్, నాగోల్-ఎల్‌బీ నగర్, 26 కి.మీ., రూ.9,100 కోట్ల అంచనా వ్యయం), (విమానాశ్రయం మెట్రో కారిడార్-రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 32 కి.మీ, రూ.6,250 కోట్ల అంచనా వ్యయం) సవరించాల్సి ఉందని తెలిపారు. సవరించిన ప్రతిపాదనల ప్రకారం ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే విషయాన్ని పరిగణించాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు. హైదరాబాద్‌లోని మూసీ రివర్ ఫ్రంట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని, అమ్యూజ్‌మెంట్ పార్కులు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్స్ వాటర్ స్పోర్ట్స్, బిజినెస్ ఏరియా, దుకాణ సముదాయాలతో బహుళ విధాలా ఉపయోగపడేలా చేయాలనుకుంటున్నట్లు కేంద్ర



మంత్రికి ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అవసరమని, అవసరమైన మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి పురీని ముఖ్యమంత్రి కోరారు.

రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద వాటిని ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ఇవ్వాల్సిన బ్యాలెన్సు నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

పాలమూరు-రంగారెడ్డికి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించండి

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించాలని జల్ శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ&జప్తి చేశారు. జల్‌శక్తి మంత్రి షెకావత్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గురువారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి పాలమూ-రు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యతను కేంద్ర మంత్రికి వివరించారు. కరవు, ఫ్లోరైడ్ పీడిత జిల్లాలైన నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నుంచి సాగు నీరు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నుంచి ఆరు జిల్లాల పరిధిలోని 1226 గ్రామాలతో పాటు హైదరాబాద్ మహా నగరానికి తాగు నీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే పలు అనుమతులు తీసుకున్నా ఇంకా హైడ్రాలజీ, ఇరిగేషన్ ప్లానింగ్, అంచనా వ్యయం, బీసీ రేషియో, అంతరాష్ట్ర అంశాలు కేంద్ర జల సంఘం పరిశీలనలో ఉన్నాయని, వాటికి వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వాలని జల్‌శక్తి మంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.. ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అదనపు నిధుల కేటాయింపునకు జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. జల్ శక్తి మంత్రిని కలిసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము పాలమూరు-రంగారెడ్డికి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించాలని జల్‌శక్తి మంత్రిని కోరామని తెలిపారు. 2014 తర్వాత కేంద్ర ప్రభుత్వం ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేదని, ఈ విధానం ప్రస్తుతం అమలులో లేదని జల్‌శక్తి మంత్రి తెలిపారన్నారు. అయితే పాలమూ-రు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా ఆ ప్రాజెక్టుకు తమ శాఖ పరిధిలోని మరో పథకం కింద 60 శాతం నిధులు కేటాయిస్తామని జల్‌శక్తి మంత్రి హామీ ఇచ్చారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ నజర్..

మొదటిపేజీ తరువాయి..

సంఖ్య ఏమాత్రం తగ్గొద్దని మోడీ దిశానిర్దేశం చేశారని.. అందుకే వెంటనే మోర్చా అధిపతులను మార్చారని సమాచారం.

బండి భుజనా కీలక బాధ్యత తెలంగాణ బీజేపీ మాజీ చీఫ్ బండి సంజయ్‌కు కీలక బాధ్యతలను హై కమాండ్ అప్పగించింది. కిసాన్ మోర్చా ఇంచార్జ్ బాధ్యతలను కట్టబెట్టింది. బీజేపీలో కీలకమైన వింగ్‌కు ఇకపై బండి సంజయ్ నేతృత్వం వహిస్తారు. తెలంగాణలో బీజేపీ ఊపు రావడానికి ఆయనే కారణం. అందుకే కీలక బాధ్యతలు ఇచ్చింది. సునీల్ బన్సాల్‌కు యువ మోర్చా ఇంచార్జ్‌గా నియమించింది. బైజయంత్ జే పాండాకు మహిళా మోర్చా బాధ్యతలు, తరుణ్ చుగ్‌కు ఎస్సీ మోర్చా బాధ్యతలు, రాధా మోహన్ దాస్ అగర్వాల్‌కు ఎస్టీ మోర్చా, వినోద్ తావ్డేకు ఓబీసీ మోర్చా, దుష్యంత్ కుమార్ గౌతమ్‌కు మైనార్టీ మోర్చా బాధ్యతలను కట్టబెట్టింది.



# బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను మహిళలు గమనించాలి

**తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతరావు**

**మంచాల - ప్రభాత సూర్యుడు:** అధికారం కోల్పోయామనే అక్క సుతో టిఆర్ఎస్ బిజెపి నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వారికి త్వరలోనే ప్రజలు చెక్ పెడతామని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీలు కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ గారు మహిళలకు మహాలక్ష్మి స్కీం కింద ఉచిత బస్సు సౌకర్యం బాగుందని ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా చాలామంది మహిళలు వినియోగించుకుంటున్నారని తెలిపారు .ముఖ్యంగా ఈ పథకము విద్యార్థులకు చిరు వ్యాపారులకు మహిళలకు బాగా ఉపయోగపడుతుందన్నారు . దీనిపై కావాలనే బిఆర్ఎస్ కుట్ర పూర్తి రాజకీయాలకు తెరతీస్తుందని మండిపడ్డారు. మహిళలు బి ఆర్ఎస్ కూ ఎక్కడ దూరం అవుతున్నారనే భయంతో ఆటో డ్రైవర్లను ఉసిగొలుపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బి ఆర్ఎస్ .బిజెపి వారు ఒకటయ్యారన్నారు. ఆటో క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి 12,000 ఆర్థిక సహాయం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ సర్కారు రేవంతన్న గారు చెప్పారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 5 లక్షల వరకు ఎక్స్ గ్రేసియా చెల్లిస్తామని తెలియజేయడం జరిగింది. టిఆర్ఎస్ హయంలో ముఖ్యమంత్రి. మంత్రులు ఎమ్మెల్యేలు. నేతలు ప్రజలను పట్టించుకోలేదని ఇప్పుడు కాంగ్రెస్ ప్రజలకు చేరువుగా ఉంటే చూసి ఓర్వలేక. సహించలేక ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో మహిళలకు కాంగ్రెస్కు పట్టం కడతారనే భయంతో మహిళలు బస్సులలో కొట్టుకుంటున్నారని బిఆర్ఎస్ వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని మహిళలకు నెలకు 2500 రూపాయలు మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందని సునీత రావు అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ. స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సదా లక్ష్మీ , కవిత ,ఉష్షశ్రీ. జిల్లా జనరల్ సెక్రెటరీ మాధవి, ప్రీతి ,వెంకటమ్మ. యాచారం మండల ప్రెసిడెంట్ మంజుల , రత్నకుమారి ,అమృత , రమా, ఇందిరమ్మ, కల్పన ,లావణ్య ,వీణ ,రాణి, ఉష, స-ునీత ,జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ ట్రాప్‌లో కాకతీయ రిజిస్ట్రార్

మొదటిపేజీ తరువాయి..

అధికారులు పట్టుకున్నారు. కాకతీయ యూనివర్సిటీలోని హాస్టళ్లకు గత నాలుగేళ్ల నుంచి రాజేందర్ అనే పాల వ్యాపారి పాలను సరఫరా చేస్తున్నాడు. కానీ కొంత కాలంగా సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో రూ.19 లక్షల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. వాస్తవానికి హాస్టల్ అధికారులు పంపిన బిల్లుకు ఆడిట్ విభాగం అధికారులు ఆమోదం తెలిపితే పాల వ్యాపారికి బిల్లులు జమ అయ్యే అవకాశం ఉంది. కానీ హాస్టల్, ఆడిట్ విభాగం అధికారులు అతనికి డబ్బులు విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. దీంతో రాజేందర్ బిల్లుల కోసం పలుమార్లు హాస్టల్ అధికారులతో పాటు ఆడిట్ సెక్షన్ అధికారుల చుట్టూ తిరిగాడు. కానీ వారు పెద్దగా పట్టించుకోలేదు. చివరకు రాజేందర్ చేసేదేమీ లేక కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రావు దృష్టికి తీసుకెళ్లాడు. బిల్లులు చెల్లించేందుకు సమయం తీసుకుంటున్నానని, బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నాడు. పట్టించుకోకపోవడంతో బిల్లుల కోసం రాతపూర్వకంగా ఫిర్యాదు కూడా చేశారు. ఆ తర్వాత కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పాల వ్యాపారికి రూ.19 లక్షల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. అయితే.. ఆ బిల్లు విడుదల చేయడానికి ఆడిట్ సెక్షన్ అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య రూ.70 వేలు డిమాండ్ చేశారు. కానీ అంత మొత్తం ఇవ్వలేక రాజేందర్ చాలాసార్లు బతిమలాడుకున్నాడు. దీంతో ఏఆర్ కిష్టయ్య రూ. 50 వేలు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేందర్ డబ్బుల కోసం ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను సంప్రదించాడు. ఇదిలావుంటే రాజేందర్ రూ. 50 వేలు పాల బిల్లు క్లియర్ చేసేందుకు శుక్రవారం డబ్బుతో రావాలని ఏఆర్ కిష్టయ్య సూచించాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇతర అధికారులు రాజేందర్ నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏఆర్ కిష్టయ్యను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం కేయూ ఆడిట్ విభాగంలో సోదాలు నిర్వహించారు. కిష్టయ్యను విచారించి వివరాలు రాబట్టారు. కాకతీయ యూనివర్సిటీలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కిష్టయ్యకు కీలక బాధ్యతలు అప్పగించడంపై యూనివర్సిటీ ఉన్నతాధికారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు ఏడెనిమిదేళ్ల క్రితం యూనివర్సిటీలో విద్యార్థుల ట్యూషన్ ఫీజు, ఇతర ఫీజుల స్వీకరణలో జరిగిన మూడు కోట్ల కుంభకోణంలో ఏఆర్ కిష్టయ్య, ప్రిన్సిపాల్ ఐలయ్యపై విచారణ కమిటీ వేశారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# సంక్రాంతికి 4,484 ప్రత్యేక బస్సులు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
సంక్రాంతి పర్వదినం సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రజల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు 4,484 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. అందులో 626 సర్వీస్ లకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. ఈ నెల 7 వ తేది నుంచి 15 వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. సంక్రాంతికి ప్రత్యేక బస్సుల ఏర్పాటు, మహాలక్ష్మి పథకం అమలు, ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు హైదరాబాద్ బస్ భవన్ లో శుక్రవారం ఉన్నతాధికారులు, ఆర్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ.. మహా లక్ష్మి స్కీం అమలు నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సంక్రాంతికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని చెప్పారు.

# ఫిబ్రవరి నుంచి మహాలక్ష్మీ పథకం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు దిశగా అడుగులు వేస్తోంది. ఆరు గ్యారెంటీల్లో ఉప్పటికే రెండింటిని అమలు చేస్తున్నారు రేవంత్‌రెడ్డి సర్కార్... మహిళ కోసం మరో పథకాన్ని త్వరలోనే అమలు చేయనుంది. నెలఖారులోగా ప్రతి మహిళకు రూ.2,500 ఇచ్చే స్కీమ్‌ను అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే... ఆరుగ్యారెంటీలు అమలు చేస్తామన్ని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. పవర్‌లోకి వచ్చిన మూడు రోజుల్లోనే రెండు హామీలను అమలు చేసి చూపించింది. ఇప్పటికే తెలంగాణలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. అందుకోసం జీరో టికెట్ విధానం కూడా తెచ్చింది. ఆధార్ కార్డుతోపాటు.. ఏదైనా ఐడెంటీ కార్డు చూపించి.. ఆర్టీసీ బస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తోంది. ఈ అవకాశాన్ని దాదాపుగా రాష్ట్ర మహిళలంతా నియోగించుకుంటున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులన్నీ ఎప్పుడూ ఫుల్లుగానే కనిపిస్తున్నాయి. ఇక రెండోది... రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా. ఈ పథకం కింద పరిమిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచింది కాంగ్రెస్ ప్రభుత్వం. పేద ప్రజలంతా ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ఇక ఇప్పుడు మరో ప్రధానమైన హామీని అమలు చేసేందుకు సిద్ధమవుతోంది కాంగ్రెస్ పార్టీ. ఈ జనవరి నెలాఖర-ులోగా ఈ పథకానికి శ్రీకారం చుట్టాలని భావిస్తోంది. మహాలక్ష్మీ పథకం కింద రూ.2,500మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయాన్ని అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. ఆ హామీని అమలు చేసేందుకు అడుగులు ముందుకు వేస్తోంది. నెలాఖరులో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయాన్ని అందించే పథకాన్ని ప్రారంభించాలని ప్లాన్ చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రాకముందే ఈ పథకాన్ని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే




ఆర్థక శాఖతో చర్చించినట్లు సమాచారం. వచ్చే నెలలో మహిళల ఖాతాల్లో రూ.2,500 జమ చేసేలా చూడాలని అధికారులు ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం.. ఇప్పటికే దరఖాస్తు ఫారాలు తీసుకుంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు విధానాన్ని తీసుకొచ్చింది. ప్రజాపాలన పేరుతో గ్రామ, వార్డు సభలు ఏర్పాటు చేసి.. దరఖాస్తులు స్వీకరిస్తోంది. దరఖాస్తుల స్వీకరణకు జనవరి 6వ తేదీ వరకే సమయం ఉంది.
అర్హులంతా ఆలోగా సంక్షేమ పథకాలకు అప్లై చేసుకోవాలని సూచించింది. దరఖాస్తుల ఆధారంగా... మహాలక్ష్మి పథకానికి లబ్దిదారులను ఎంపిక చేసి.. నెలకు రూ.2,500 ఇచ్చే పథకాన్ని అమలు చేయబోతోంది రేవంత్‌రెడ్డి సర్కార్. తెలంగాణ మహిళలు కూడా నెలకు రూ.2,500 పథకం ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా అని ఎదురుచూస్తున్నారు. దీంతో... వీలైంత త్వరగా ఈ స్కీమ్‌ను అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టింది.
ఒకవేళ లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే... ఎన్నిక కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో పథకాల అమలు ఆలస్యమవుతుంది.
అదే జరిగితే... లోక్‌సభ ఎన్నికల వేళ ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని టార్గెట్ చేసే అవకాశం ఉంటుంది. ఆ అవకాశం ప్రతిపక్షాలకు ఇవ్వకుండా... మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం నెలకు రూ.2,500 ఆర్థిక సాయాన్ని త్వరగా అమలు చేసే పనిలో ఉంది తెలంగాణ ప్రభుత్వం. లోక్‌సభ నోటిఫికేషన్ వచ్చేలోగా ఈ పథకాన్ని ఆచరణలో పెట్టాలని.. వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే కర్ణాటక, మధ్యప్రదేశ్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లోనూ ఇలాంటి పథకాలే అమల్లో ఉన్నాయి. దీంతో ఆ పథకాలపై అధ్యయం చేసి, ఎంత ఖర్చు అవుతుందో తెలపాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు సమాచారం.

# నల్లగొండకు మరో మంత్రి పదవి..



**నల్లగొండ, ప్రభాతసూర్యుడు :**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రోజు నుంచే కేబినెట్ లో బెర్త్ కోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి ఎన్నికల ముందు ఏఐసీసీ నాయకత్వం మంత్రి పదవి ఇస్తామన్న హామీ వల్లే రాజగోపాల్ రెడ్డి బీజేపీని వీడి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారన్న ప్రచారం కూడా ఉంది. కాంగ్రెస్ నుంచి ఎంపీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా విజయాలు సాధించిన రాజగోపాల్ రెడ్డి 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచాక సీఎల్పీ పదవి కోసం కూడా ప్రయత్నించారు. ఆ పదవి దక్కకపోవడంతో, ఉత్తమ్ కుమార్ రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవీ కాలం ముగిశాక, కొత్త పీసీసీ సారథి కోసం కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఆలోచనలు మొదలు పెట్టడంతోనే రాజగోపాల్ రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవి కోసం కూడా ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత నుంచి పార్టీతో అంటీ ముట్టనట్టుగానే ఉన్న ఆయన చివరకు కాంగ్రెస్ ద్వారా వచ్చిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, బీజేపీలో చేరారు. బీజేపీ అభ్యర్థిగి మునుగోడులో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడం తెలంగాణ కాంగ్రెస్ కు కొంత ఊపు తెచ్చిపెట్టింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం అందిరిలో కలిగింది. ఈ సమయంలోనే ఏఐసీసీ నాయకత్వం రాజగోపాల్ రెడ్డిని బీజేపీ నుంచి తిరిగి కాంగ్రెస్ లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నామినేషన్ల దాఖలు సమయంలో పార్టీలో చేరి, మునుగోడు టికెట్ తెచ్చుకున్న రాజగోపాల్ రెడ్డికి ముందే మంత్రి పదవి హామీ ఇచ్చారని తెలుస్తోంది. ఈ కారణంగానే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రి వర్గంలో చోటు దక్కుతుందని ఆయన భావించినా, తొలి విడతలో ఆయనకు అవకాశం దక్కలేదు. మరో వైపు రాష్ట్ర కేబినెట్లో మరి కొన్ని బెర్తులు ఖాళీగా ఉండడంతో మంత్రి పదవి కోసం రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి ప్రయత్నాల మాటెలా ఉన్నా.. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఇప్పటికే మంత్రులుగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కేబినెట్ లో ఉన్నారు. వీరిద్దరూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు. ఇక పోతే ఒకే జిల్లా నుంచి ముగ్గురికి మంత్రి పదవి ఇవ్వడం సాధ్యమేనా..? అదీ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి ఎలా ఇస్తారు అన్న సందేహాలతో పాటు.. ఒకే కుటుంబానికి చెందిన సోదరులైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో అన్నదమ్ములిద్దరికీ పదవులు ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉమ్మడి ఏపీలో వైఎస్ కేబినెట్‌లో ఖమ్మం జిల్లాకు చందిన రాంరెడ్డి వెంకటరెడ్డికి మంత్రి పదవి ఇవ్వడం వల్ల, నల్గొండ జిల్లాకు చెందిన ఆయన సోదరుడు సూర్యాపేట ఎమ్మెల్యేగా ఉండిన రాంరెడ్డి దామోదర్ రెడ్డికి మంత్రి వర్గంలో చోటు లభించని అంశాన్ని విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో సైతం ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారయణరెడ్డి సోదరుల్లో వివేకానందరెడ్డికి అవకాశం దక్కని అంశాన్ని వీరు ఉదహరిస్తున్నారు. తక్కువ మంత్రి పదవులు ఉండడం, ఆశావాహులు ఎక్కువగా ఉండడం, ఇప్పటి దాకా మంత్రివర్గంలో చోటు దక్కని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు పార్టీ హైకమాండ్ ఆలోచన చేస్తోందన్న వార్తల నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డికి ఏ లెక్కన మంత్రి పదవి దక్కుతుందన్న అంశం చుట్టూ చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేదు. అదే మాదిరిగా, ముస్లిం మైనారిటీల నుంచి ప్రాతినిధ్యం లేదు. ఈ కారణంగానే ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించి, ఈ ఖాళీని భర్తీ చేయాలన్న ఆలోచనలో కూడా ఉన్నట్టు చెబుతున్నారు. మరో వైపు జిల్లాకు చెందిన నాయకుడు అద్దంకి దయాకర్ మొన్నటి ఎన్నికల సమంయలో పార్టీ సూచన మేరకు తుంగతుర్తి టికెట్ ను త్యాగం చేశారని, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయనను మండలిలోకి తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. ఆయన కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారని తెలుస్తోంది. దీంతో ఈ అంశాలన్నింటినీ విశ్లేషిస్తే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మంత్రి పదవి వరిస్తుందా..? లేదా..? అన్న విషయం ఉత్కంఠరేపుతోంది.

# రోడెక్కిన మంత్రి మల్లారెడ్డి బాధితులు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
లంగాణలో ప్రజాప్రతి నిధుల భూభాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు అధికార, అంగ బలాన్ని అడ్డుపెట్టుకుని తమ భూములు లాక్కున్నారంటూ బాధితులు గోడు వెళ్ళబో-సుకునేందుకు ముందుకు వస్తున్నారు. తాజాగా మాజీ మంత్రి మల్లారెడ్డి తమ భూములు కబ్జా చేశారని ప్రజావాణిలో తమ సమస్య చెప్పుకునేందుకు వచ్చారు. మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లికి చెందిన దాదాపు 600 మంది బాధితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మల్లారెడ్డిపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ ముఖ్యమంత్రి కార్యాలయంలో మొరపెట్టుకున్నారు. శ్రీ మల్లికార్జున నగర్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీలో తమ భూములను మల్లాఃరెడ్డి కబ్జా చేశారంటూ ఫ్లెక్సీలతో ప్రజాభవన్ ముందు ఆదోళనకు దిగారు. మల్లారెడ్డిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫేక్ డాక్యుమెంట్స్‌తో మల్లారెడ్డి తమ భూములు కబ్జా చేశారని ఆరోపించారు. ఈ మేరకు తన భూమిలోని 360 ప్లాట్లలో 110 ప్లాట్లు మల్లారెడ్డి కబ్జా చేశారని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నిస్తే అధికారం అడ్డంపెట్టకుని బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. గతంలోనూ దీనిపై న్యాయ పోరాటం చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. కనీసం ఇప్పుడైనా కాంగ్రెస్ గవర్నమెంట్, రెవిన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని వినతులు ఇస్తున్నారు. ఇక ప్రజావాణి కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు బాధితులు సైతం ఆందోళనకు దిగారు. ప్రేమ్ సాగర్ రావు తమ నుంచి తమ ప్లాట్లను కాపాడాలంటూ కాప్రా కృష్ణా నగర్ ప్లాట్ ఓనర్స్ నిరసన చేపట్టారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక మొదలు పెట్టిన ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద ఎత్తున వినతి పత్రాలు వస్తుండగా ఇందులో భూవివాదాలే ఎక్కువ సంఖ్యలో ఉండటం గమనార్హం.

# విచారణ అంటే వణుకు ప్రారంభమైంది

మొదటిపేజీ తరువాయి..
బయటకు పంపింది ఎవరు, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని కేటీఆర్ ను ప్రశ్నించారు. మహిళలపై దాడులు జరిగినప్పుడు గానీ, కొండగట్టు వద్ద జరిగిన ఘోర ప్రమాదం లో 63 మంది చనిపోతే స్పందించని నేతలకు ఇప్పుడు నోరు లేస్తుంది ఎందుకంటూ అసహనం వ్యక్తం చేశారు. దళితులకు మూడెకరాల భూమి ఏమైంది.. తెలంగాణకు దళితుడిని తొలి ముఖ్యమంత్రి చేస్తామని చెప్పిందెవరు ? రైతుల రుణమాఫీ ఇస్తామని ఎగ్గొట్టింది ఎవరు..? తొమ్మిదిన్నరేండ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. బీఆర్ఎస్ అహంకారంతో పరిపాలన అస్తవ్యస్తమైంద న్నారు. అధికారం కోల్పోగానే ఇప్పుడు ప్రజలపై ప్రేమ, అనురాగాలు పుట్టుకొచ్చాయా. ప్రజల కోసం తొలిరోజు నుంచే పనిచేస్తున్న తమ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటు అన్నారు మంత్రి కొండా సురేఖ. 'అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఇచ్చిన అభయహస్తం గ్యారంటీ హామీలను అమలు చేస్తున్నాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. మీ కుటుంబంలోని మహిళలనో, మీ పార్టీ మహిళా లీడర్లనో ఒక్కసారి ఆర్టీసీ బస్సులో ఒక్కసారి ప్రయాణం చేయాలని చెప్పండి. మా హామీలు అమలవుతున్నాయో లేదో తెలుస్తుంది. ప్రజలను లైన్లలో నిలబెట్టి.. ప్రతిరోజు ప్రజలను గోస పెడుతున్నమని మాట్లాడటం కేటీఆర్ అహంకారానికి నిదర్శనం. గడీలు, ఫామ్ హౌజ్లో ఉన్న కేసీఆర్, కేటీఆర్‌కు ప్రజల బాధలు ఇప్పుడు కనిపిస్తున్నాయా?' అని మంత్రి కొండా సురేఖ



ప్రశ్నించారు. వరంగల్ లో సెంట్రల్ జైల్ ను కూల్చి, హాస్పిటల్ ఎందుకు కట్టారు. హాస్పిటల్ మంచి వాతావరణంలో కట్టాలని సూచిస్తే తప్పుగా ప్రచారం చేశారు. ఆందోళనలు, ధర్నాలపై సైతం నిషేధం విధించి.. ధర్నా చౌక్‌ను ఎత్తేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్ కు దక్కుతుందని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి రాగానే ప్రగతిభవన్ ఇనుప బారికేడ్లు తొలగించి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రజావాణి చేపట్టామన్నారు. శ్వేతపత్రాలతో ఎవరు భయపడుతున్నారు... ? తెలంగాణను అప్పులపాలు చేసింది ఎవరు? కాంగ్రెస్ వస్తే పరిశ్రమలు పోతాయి.. కరెంటు పోతుందని మీరు చేసిన విష ప్రచారం ప్రజలు ఇంకా మరిచిపోలేదు అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ తోడు దొంగలు అని, అందుకే ఎన్నికల ప్రచారంలో బీజేపీని కేసీఆర్ విమర్శించలేదన్నారు. లిక్కర్ స్కామ్ ఎటు పోయింది? ఎవరు ఎవరితో అంట కాగారు? ప్రధాని మోదీని ఒక్క మాట అనేందుకు కేసీఆర్ భయపడ్డారు! ల్యాండ్ క్రూజర్ వెహికల్స్ 22 కొనుగోలు చేసి విజయవాడలో పెట్టింది నిజం కాదా? వీవీఐపీల భద్రత కోసం వాహనాలు కొనుగోలు చేయాలని కేబినెట్ మీటింగ్ లో నిర్ణయం తీసుకుంటే ప్రజలకు ఎందుకు చెప్పలేదు అని ప్రశ్నించారు.

# కాంగ్రెస్, ఎంఐఎం ఆధిపత్య పోరు

## పాతబస్తిలో ఉద్రిక్తత

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
హైదరాబాద్ ఓల్డ్ సిటీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ పార్టీ బలమైన ఉనికి నెలకొల్పడానికి ప్రయత్నాలు చేస్తోంది. దాంతో.. ఎంఐఎం ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే ఐదు గ్యారెంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. డిసెంబర్ 28 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులతో పాటు, ప్రజాప్రతినిధులు చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రజల నుంచి గ్యారెంటీల అమలు కోసం దరఖాస్తులు తీసుకుంటున్నారు. రానున్న జీహెచ్ఎంసీ, లోక్సభ ఎన్నికల్లో ఎలాగైనా మెజార్టీ సీట్లు సాధించేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది.



# రోడ్డు ప్రమాదంలో పదిమందికి గాయాలు

**ఖమ్మం, ప్రభాతసూర్యుడు :**
ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామంలో పెనుప్రమాదం చోటుచేసుకుంది. సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసి బస్సు కూలీల ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి.. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణి-స్తున్న పది మందికి తీవ్ర గాయాలు కావటంతో అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా చాట్రాయి మండలం నుండి కూలీ కోసం తుంబూరు గ్రామానికి వస్తున్న 25 మంది కూలీలతో వస-్తున్న ఆటో ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీ కొనటంతో ప్రమాదం చోటు చేసుకుంది.. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో 25 మంది కూలీలు, ఆర్టీసీ బస్సులో సత్తుపల్లి కాలేజ్ కు వేళ్ళే విధ్యార్ధులు ఉన్నారు. ఆటోలో ఉన్న కూలీలకు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. దీనితో పెనుప్రమాదం తప్పినట్లైంది. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# కొత్తపల్లిలో యువతిపై దాడి



## తప్పిన ప్రాణాపాయం

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు :** కరీంనగర్ శివారు కొత్తపల్లి పట్టణంలో ఓ ప్రేమ పేరుతో ఘాతుకానికి పాల్పడ్డాడు. ఎన్ని సార్లు కోరినా తనను ప్రేమించడం లేదని తన ఎదురింటి యువతిపై బ్లేడ్తో దాడి చేశాడు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న 24 ఏళ్ల యువతి కావ్య శ్రీ (25 )ని ఇంటి ఎదురుగా ఉండే బొద్దుల సాయి గత మూడు నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నాని వెంటపడుతున్నాడు. సదరు విషయం యువతి తన కుటుంబ సభ్యులకు చెప్పడంతో పంచాయతీ పెట్టి యువకుణ్ని హెచ్చరించారు. అయితే కొద్ది కాలం పాటు మౌనంగా ఉన్న సాయి అమ్మాయిని తాను తప్ప ఎవరూ పెళ్లి చేసుకోకూడదు అంటూ పలుమార్లు సన్నిహితుల వద్ద వాదనకు దిగాడు. ఇదే విషయంపై అమ్మాయి తండ్రికి సైతం ఫోన్లో మెసేజ్ పంపిస్తూ ఉండేవాడు.. అయితే అటువైపు నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో అధర్ చూసిన సాయి కావ్య శ్రీ పై దాడికి దిగగా అరుపులు కేకలు విన్న చుట్టుపక్కల వారు సమయానికి స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. గాయపడ్డ యువతిని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించి చికిత్స అందిస్తున్నారు నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

# సంపాదకీయమ్..

## ఖర్గేకు పరీక్షా కాలమే..

వారసత్వ రాజకీయాలు అనే చర్చ వస్తే ముందుగా కాంగ్రెస్ పార్టీనే ప్రస్తావిస్తారంతా. అంతగా ఆ పార్టీ గురించి ఆ అభిప్రాయం అందరిలోనూ నాటుకుపోయింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ ప్రచారాన్ని గట్టిగానే చేసింది. ఎన్నికల సమయంలో ప్రతిసారీ ఈ అస్త్రాన్నే ప్రయోగిస్తూ ఉంటుంది. తమ స్వార్థ రాజకీయాల కోసం దేశ భద్రతను పణంగా పెట్టారంటూ తీవ్రంగానే మండి పడుతుంది. ఈ మరకను పోగొట్టుకునేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాల్లో ఒకటి..అధ్యక్ష పదవిని గాంధీ కుటుంబానికి చెందిన వ్యక్తికి కాకుండా వేరే వ్యక్తికి అప్పగించడం. దళిత నేత, పార్టీకి ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న మల్లికార్జున్ ఖర్గేని ఎన్నుకుంది. దాదాపు ఏడాదిగా ఆయన ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వెనకబడిన వర్గానికి చెందిన ఓ కీలక నేతకు పార్టీ పగ్గాలు అప్పగించి తమ పార్టీ సిద్ధాంతం మారిపోయిందనే సంకేతాలిచ్చింది కాంగ్రెస్. "ఖర్గే కీలుబొమ్మ మాత్రమే" అని బీజేపీ విమర్శలు చేస్తున్నా పట్టించుకోలేదు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీని సంప్రదించకుండా ఆయన ఏ నిర్ణయం తీసుకోకపోవచ్చు. కానీ...ఇప్పటి వరకూ హైకమాండ్తో విభేదాలు మాత్రం లేవు. విధేయుడిగా ఉంటూనే సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టో తయారు చేయడం నుంచి ప్రచారం వరకూ ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుంటున్నారు. పార్టీని గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేస-్తున్నారు. ఎన్నికల ఫలితాల సంగతి ఎలా ఉన్నా గతంతో పోల్చుకుంటే కొంతలో కొంతైనా కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందని పార్టీ వర్గాలు చాలా ధీమాగా చెబుతున్నాయి. అయితే...ఈ మధ్య జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మాత్రం కాంగ్రెస్ని డీలా పడేశాయి. మూడు రాష్ట్రాల్లో బీజేపీయే అధికారంలోకి వచ్చింది. మిగతా రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉన్నా రాజస్థాన్లో అంతర్గత కలహాలు కాంగ్రెస్ని బాగా దెబ్బ తీశాయి. "కాంగ్రెస్ అంటే ఇంతే" అనే మచ్చ తెచ్చి పెట్టాయి. ఇప్పుడిదే అంశంపై ఫోకస్ పెట్టారు మల్లికార్జున్ ఖర్గే. అందుకు కారణం మరి కొద్ది నెలల్లోనే లోక్సభ ఎన్నికలు జరగనుండడం. జరిగిందేదో జరిగింది..ఇక జరగాల్సింది చూడండి అని పార్టీ నేతలకు హితోపదేశం చేస్తున్నారు ఖర్గే. ఈ ఎన్నికలకు మిగిలింది మూడు నెలలే. అందుకే ఇప్పటి నుంచే కార్యకర్తల్ని సిద్ధం చేసి ప్రచారాన్ని మొదలు పెట్టాలన్న దూకుడుతో ఉన్నారు. అందుకే "మీలో మీరు గొడవ పడడం ఆపేసి పార్టీ కోసం పని చేయండి" అని సున్నితంగానే మందలించారు ఖర్గే. కానీ ఇది ఎంత వరకూ పాటిస్తారన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. ఓ రకంగా చెప్పాలంటే రానున్న లోక్సభ ఎన్నికలు కాంగ్రెస్కే కాదు...ఖర్గేకి కూడా లిట్మస్ టెస్ట్ లాంటివే. అధ్యక్ష పదవి వచ్చిన తరవాత తొలిసారి సార్వత్రిక ఎన్నికలను ఎదు-ర్కోబోతున్నారు. ఇలాంటి సమయంలోనే హైకమాండ్ ఖర్గేపై చాలా అంచనాలే పెట్టుకుంటుంది. ఆ అంచనాలను ఖర్గే అందుకుంటారా లేదా అన్నదే ఇక్కడ కీలకమైన విషయం. ఇటీవల జరిగిన మీటింగ్లో ఖర్గే చెప్పిన ముఖ్యమైన విషయం ఏంటంటే..మైక్రో మేనేజ్మెంట్. అంటే పోలింగ్ బూత్లలోని ఓటర్లను వ్యక్తిగతంగా కలవడం. ఎక్కడెక్కడ ఏయే వర్గాల వాళ్లు ఎక్కువగా ఉన్నారో తెలుసుకోవడం. దాని ఆధారంగా వ్యూహాలు సిద్ధం చేసుకోవడం. ఇదీ ప్రణాళిక. ఇదే సమయంలో చాలా ముఖ్యమైన విషయం చెప్పారు ఖర్గే. "అంతర్గత సమస్యల్ని అనవసరంగా బయట పడేయొద్దు" అని. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సహా మైనార్టీ ఓట్లపైనే మల్లికార్జున్ ఖర్గే ఎక్కువగా దృష్టి పెట్టారు. కొన్ని చోట్ల వాళ్ల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందన్నది ఆయన చేస్తున్న వాదన. ఖర్గే ముందున్న అతి పెద్ద సవాళ్లలో మరోటి ఇండియా కూటమిలో చీలికలు రాకుండా చూసుకోవడం. ఇది చాలా పెద్ద టాస్క్. ఎన్డీయేని ఢీకొట్టాలంటే కూటమిగానే కలిసుండాలన్నది కాంగ్రెస్ సిద్ధాంతం. గెలుపోటముల సంగతి పక్కన పెడితే ఈ ఆలోచన సరైందే అయ్యుండొచ్చు. కానీ...కూటమిలో చివరి వరకూ విభేదాలు రాకుండా ఉంటాయా అన్నది అనుమానమే. ఇప్పటికే కాస్త రుసరుసలు మొదలయ్యాయి. సీట్ల షేరింగ్ విషయంలో ఖర్గే ఏం చేయనున్నారన్నదీ ఉత్కంఠ రేపుతున్న అంశం. సీట్ల షేరింగ్లో ఇంకా క్లారిటీ రాకముందే ప్రధాని అభ్యర్థిపై చర్చ జరుగుతోంది. పైగా...మల్లికార్జున్ ఖర్గేని ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదించారు మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్. ఈ ప్రతిపాదనలపై ఖర్గే స్పందించిన తీరు చూస్తుంటే ఆయనకీ ప్రధాని అభ్యర్థిగా నిలబడడం ఆసక్తిగానే ఉన్నట్టు అనిపిస్తోంది. మోదీని ఎదుర్కోవడమే తన తొలి కర్తవ్యం అని..మిగతావి ఎలా జరిగితే అలా జరుగుతాయని అన్నారే తప్ప ఆ ప్రతిపాదనల్ని కొట్టిపారేయలేదు. నిజంగా ఆ పోటీకి అర్హుడే అని పార్టీ వర్గాలు కూడా గట్టిగానే చెబుతున్నాయి. ఏడాది కాలంలోనే పార్టీని తన గ్రిప్లో పెట్టుకోగలిగారు. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలకు నమ్మిన బంటుగా ఉండడమే కాకుండా...మిగతా ప్రతిపక్షాలతో కమ్యూనికేషన్ని పెంచగలిగారు. వీటికి తోడు కర్ణాటక, తెలంగాణలో విజయం సాధించడం వెనక ఖర్గే పాత్ర తప్పకుండా ఉంది. రెండు చోట్లా మేనిఫెస్టోలు అంత బాగా ప్రజల్లోకి వెళ్లాయంటే అందుకు కారణం ఖర్గే. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఆయన వ్యూహాలు ఫలించాయి. కానీ ఉత్తరాదిలో మాత్రం ఈ స్ట్రాటెజీ వర్కౌట్ కాలేదు. రాజస్థాన్లో సచిన్ పైలట్, అశోక్ గహ్లోట్ మధ్య ఉన్న విభేదాలను ఆయన పూర్తి స్థాయిలో పరిష్కరించలేకపోయారన్న వాదనలూ ఉన్నాయి. అయితే..అంతకు ముందు కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు రణదీప్ సింగ్ సుర్జేవాలా, జైరాం రమేశ్ మధ్య ఉన్న వైరంతో పార్టీకి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్త పడడంలో మాత్రం సక్సెస్ అయ్యారు మల్లికార్జున్ ఖర్గే. అంతే కాదు. బీజేపీ ఎక్కడైతే బలహీనంగా ఉందో అక్కడ స్వింగ్ని తమ వైపు తిప్పుకోడంలో ఖర్గే సిద్ధహస్తుడు అన్న పేరుంది.ఇక రాహుల్ గాంధీ చేపట్టనున్న భారత్ న్యాయ్ యాత్రనీ దగ్గరుండి పరిశీలించనున్నారు. ఇది కాంగ్రెస్ ఫేట్ని తప్పకుండా మారుస్తుందన్న ధీమాతో ఉన్నారాయన. కానీ...ఇండియా కూటమి చివరి వరకూ విడిపోకుండా కలిపి ఉంచే పెద్ద బాధ్యత ఖర్గేపైనే ఉంది. ఏ మాత్రం తేడా వచ్చినా అది పార్టీపైనే కాకుండా ఆయన నాయకత్వంపైనా ఇంపాక్ట్ చూపిస్తుంది. ఇప్పుడు అసలు సిసలు సవాల్...లోక్సభ ఎన్నికల్లో అభ్యర్థులను ఎంచుకోవడం. అలకలు, అసంతృప్తులు లేకుండా జాగ్రత్త పడడం కత్తిమీద సామే. ఈ ఫేజ్ని ఆయన ఎలా దాటుతారా అన్నదే చూడాల్సి ఉంది.

# మున్సిపాలిటీలపై కాంగ్రెస్ కన్ను




**నల్లగొండ, ప్రభాతసూర్యుడు :** రాష్ట్రంలో అధికారం మారడం, జిల్లాల రాజకీయ ముఖచిత్రాల్లో మార్పులకు కారణం అవుతోంది. గత ఏడాది తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో మెజారిటీ సాధించి కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టగా, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు తెరపడింది. బీఆర్ఎస్ 2018లో రెండో సారి అధికారం చేపట్టాక జరిగిన అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాలు సాధించింది. ప్రధానంగా మున్సిపాలిటీల్లో మెజారిటీ బీఆర్ఎస్ వశం అయ్యాయి. కొన్ని చోట్ల అధికారంలోకి రాగలిగిన స్థాయిలో బలం తెచ్చుకున్నా, కాంగ్రెస్ స్థానిక పీఠాలకు దూరం కావాల్సి వచ్చింది. ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లతో బీఆర్ఎస్ గట్టెక్కింది. ఇపుడు పరిస్థితి మారింది. బీఆర్ఎస్ అధికారం నుంచి దిగిపోయి, పాలన కాంగ్రెస్ చేతికి వచ్చింది. దీంతో కాంగ్రెస్ స్థానిక నాయకత్వాలు మున్సిపాలిటీల్లో అధికారం కోసం ఎత్తులు వేస్తున్నాయి.ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం 19 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో అతి ముఖ్యమైనది నల్గొండ జిల్లా కేంద్ర మున్సిపాలిటీ. ఈ మున్సిపాలిటీని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 19 మున్సిపాలిటీల్లో నల్గొండ, నేరెడుచర్ల, నందికొండ, హాలియా, చండూరు, కోదాడ, భువనగిరి, మోత్కూరు, ఆలేరు మున్సిపాలిటీల చైర్మన్లను దించేసి తమ పార్టీని మున్సిపల్ పీఠం ఎక్కించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికోసం మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాస నోటీలను ఆయా జిల్లాల కలెక్టర్లకు అందజేశారు. కొన్ని చోట్ల కాంగ్రెస్ మంచి మెజారిటీతో మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నా.. ఆ తర్వాత వారిపై ఒత్తిళ్లు పెట్టడం ద్వారా చైర్మన్లు, పాలకవర్గంలోని అత్యధిక మంది కౌన్సిలర్లు పార్టీ మారి గులాబీ కండువాలు కప్పుకునేలా చేయగలిగారు. ఇలాంటి మున్సిపాలిటీల్లో ఇదే వ్యూహాన్ని ఇపుడు కాంగ్రెస్ అమలు చేయాలని చూస్తోంది.ఉమ్మడి నల్గొండ జిల్లాలో అయిదు మున్సిపాలిటీల చైర్మన్లు ముందుగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి మారిపోవడంతో వీరు అవిశ్వాస తీర్మానాల నుంచి బయటపడ్డారు. దేవరకొండ, చిట్యాల, హుజూర్ నగర్, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్మన్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు. దీంతో ఈ మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చాయి. ఈ మున్సిపాలిటీల్లో ఎలాంటి పదవుల మార్పిడికి అవకాశం లేకుండా పోయింది. వీరంతా మొన్నటి శాసన సభ ఎన్నికలకు ముందే పార్టీ మారి, కాంగ్రెస్ అభ్యర్థుల కోసం పనిచేశారు. వారంతా ఎన్నికల్లో విజయం సాధించడంతో మున్సిపల్ చైర్మన్లు తమ పదవులు కాపాడుకున్నట్లు అయ్యింది.ఉమ్మడి నల్గొండ జిల్లా కేంద్రమైన నల్గొండ మున్సిపాలిటీ వ్యవహారం ఇపుడు హాట్ టాపిక్ గా మారింది. 48 మంది కౌన్సిలర్లు ఉన్న ఈ మున్సిపాలిటీలో ఇపుడు బీఆర్ఎస్ లో కేవలం ఎనిమిది మంది మాత్రమే మిగిలారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ సమ ఉజ్జీలుగా కౌన్సిలర్లను గెలుచుకున్నా.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యుల ఎక్స్ అఫీషియో ఓట్లతో కాంగ్రెస్ మున్సిపల్ పీఠాన్ని ఎక్కకుండా అడ్డుకుని బీఆర్ఎస్ నుంచి సైదిరెడ్డిని చైర్మన్ చేశారు. కానీ, ఎన్నికల ముందే బీఆర్ఎస్ కు చెందిన వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ సహా, పది మంది కౌన్సిలర్లు గులాబీ గూటిని వీడి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఆ తర్వాత కూడా మరికొందరు పార్టీ మారారు. ఇదే అదునుగా మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ గా ఉన్న బుర్రి శ్రీనివాస్ రెడ్డిని మున్సిపల్ చైర్మన్ చేసేందుకు అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి. ఇప్పటికే కలెక్టర్ అవిశ్వాస నోటీసు ఇవ్వడంతో ఈ నెల 8వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ఆ రోజు అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగనుంది. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు చైర్మన్ సైదిరెడ్డి హైకోర్టు గడప తొక్కారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి విప్ జారీ చేయించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. కాగా, 8వ తేదీ సమావేశం తర్వాత.. ఈ నెల 16వ తేదీన కాంగ్రెస్ నుంచి చైర్మన్ ఎన్నిక ఉంటుందన్న భరోసాలో కాంగ్రెస్ నాయకత్వం ఉంది. జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో జరుగుతున్న అవిశాస రాజకీయాలు చర్చనీయాంశం అవుతున్నాయి.

# కాంగ్రెస్ గూటికి కార్పొరేటర్ల బాట




**వరంగల్, ప్రభాతసూర్యుడు :**
కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠంపై గురి పెట్టింది. బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లకు ఎర వేయడంతో ఒక్కరొక్కరు హస్తం గూటికి ధారపడుతున్నారు. తాజాగా వరంగల్ పశ్చిమ నియోజవర్గానికి చెందిన ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు, పలువురు ముఖ్య నేతలు కారు దిగి కాంగ్రెస్కు షేక్ హ్యాండ్ ఇచ్చారు. వరంగల్ కార్పొరేషన్ లో.. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధికంగా 48 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 10 స్థానాలు గెలిచి రెండో స్థానంలో నిలవగా.. కాంగ్రెస్ 7 సీట్లు గెలుచుకుని మూడో స్థానంలో నిలిచింది. స్వతంత్రులు ఒకటి గెలిచారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ కార్పొరేటర్లపై గురి పెట్టింది. ఇందులో భాగంగా బుధవారం ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరగా, మరో 15 మంది కాంగ్రెస్ తో టచ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన కార్పొరేటర్లు హస్తం గూటికి చేరిన వారిలో ఉన్నారు. బీజేపీ నుంచి సైతం ఇద్దరు కార్పొరేటర్లు చేరారు. వరంగల్ తూర్పు నుంచి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరుతారని తెలుస్తోందిఇంకా ఎంతమంది కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ లిస్టులో ఉన్నారు..? జీడబ్ల్యూఎంసీ మేయర్ పీఠం స్వాధీనం చేసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీకి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ ఎంత..? అవిశ్వాసం సాధ్యమేనా..దీంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠంపై కాంగ్రెస్ పార్టీ గురి పెట్టినట్లు కనిపిస్తోంది. ఇప్పటికే చుట్టుపక్కల మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలతో కుర్చీలు హస్తం వశం అవుతుండగా, రాష్ట్రంలో కీలకమైన గ్రేటర్ మేయర్ సీటుపై మూడు రంగుల జెండాను ఎత్తాలని కాంగ్రెస్ పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రమంలోనే గ్రేటర్ మేయర్ పై అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. వరంగల్ పశ్చిమ నియజక వర్గానికి చెందిన ఆరుగురు బీఆర్ఎస్ కార్పోరేటర్లు, ఐదుగురు మాజీ కార్పరేటర్లు, పలువురు ముఖ్య నేతలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో వీరంతా కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో గ్రేటర్ వరంగల్లో పట్టు సారిస్తోంది కాంగ్రెస్. ఈ నేపథ్యంలోనే జీడబ్ల్యూఎంసీ మేయర్ పీఠం దక్కించుకోవడం కోసం గతవారం రోజులుగా వరంగల్ పశ్చిమ ఓఎం, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి చేస్తున్న మంతనాలు ఫలించాయి. ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు..నాయిని రాజేందర్ రెడ్డి ఆపరేషన్ సక్సెస్ అవడంతో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట లోనూ ఆపరేషన్ ఆకర్ష్ మొదలు పెట్టారు. ఇప్పటికే ఎనిమిది మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లతో మంత్రి కొండా సురేఖ, కొండా మురళి మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. రేపో మాపో వారు కూడా కొండా మురళి నేతృత్వం లో కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారని సమాచారం. ఇక వర్ధన్నపేట నియోజక వర్గం పరిధిలో నలుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ గూటికి చేరడానికి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే ఐఖీ నాగరాజు వారితో మంతనాలు జరుపుకుంటున్నారు. రేపోమాపో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పు కాబోతున్నట్లు సమాచారం..ఈ క్రమంలోనే అవిశ్వాసం ప్రవేశపెట్టి గ్రేటర్ వరంగల్ మేయర్, డిప్యూటీ మేయర్ పీఠం కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పావులు కదుపుతోంది. అయితే జీడబ్ల్యూఎంసీ లో ఎవరి బలమేంతా..? బలగమెంతా..? అవిశ్వాసానికి ఆస్కారం ఉందా అనే చర్చ జరుగుతుంది. జీడబ్ల్యూఎంసీ లో మొత్తం 66 డివిజన్లు ఉండగా వాటిలో 51స్థానాల్లో బీఆర్ఎస్, 9 స్థానాల్లో బీజేపీ, 4 స్థానాల్లో కాంగ్రెస్, 2 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు కార్పొరేటర్లుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం హనుమకొండ కు చెందిన ఆరుగురు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ కార్పొరేటర్ల సంఖ్య 10కి చేరింది. మరో 12 మంది చేరికకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు మంతనాలు జరుగుతున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ల సంఖ్య 22 కు చేరుతుంది.అయితే కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం పెట్టినా నెగ్గే పరిస్థితి లేదు. మెజారిటీ ఫిగర్ ప్రకారం 34 మంది సభ్యుల మద్దతు ఉంటేనే మేయర్ పీఠం దక్కుతుంది. ప్రస్తుతం ఆరుగురు కాంగ్రెస్ పార్టీలో చేరడం ద్వారా బీఆర్ఎస్ సభ్యుల సంఖ్య 45 కు చేరింది. ఇప్పుడున్న వారు చేజారిపోకుండా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం, మేయర్, డిప్యూటీ మేయర్ , మాజీ ఎమ్మెల్యేలు వారితో మంతనాలు మొదలు పెట్టారు. బుజ్జగింపులతో ఓదార్చుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు జీడబ్ల్యూఎంసీ లో రగిలిన ముసలం హాట్ హాట్ చర్చ కు దారితీస్తుంది.. మరి బీఆర్ఎస్ మంతనాలు ఫలిస్తాయా..? లేక కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ సక్సెస్ అవుతుందో వేచి చూడాలి..!

## నాగోల్లో రోడ్డు ప్రమాదం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** కుత్బుల్లాపూర్కు చెందిన కుతాడి కుమార్, అతని కుమారుడు ప్రదీప్ (7వ తరగతి చదువుతున్నాడు) తండ్రీ కొడుకు ఇద్దరు కలిసి ఎలక్ట్రిక్ బైక్పై వెళుతున్నారు. ఈ క్రమంలో పాపాయి గూడ చౌరస్తా వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీని బైక్ ఢీకొట్టింది. ప్రమాదం తర్వాత టిప్పర్ లారీ క్యాబిన్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో లారీ, ఎలక్ట్రిక్ స్కూటర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా టిప్పర్ లారీలో మంటలు రావడంతో అక్కడే వున్న ప్రదీప్ కూడా సజీవ దహనమయ్యాడు. అతని తండ్రి కుమార్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒకే కుటుంబంలో తండ్రీ కొడుకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఇద్దరు వాట్సాప్ దొంగల అరెస్టు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
వాట్సాప్ లో 107 ఐఫోన్స్ ఆర్డర్ చేసి మోసం చేసిన ఇద్దరిని అబిడ్స్ పోలీసులు అరెస్టు చేసారు సెంట్రల్ జోన్ శరత్ చంద్ర పవార్ కేసు వివరాలు వెల్లడించారు. నిందితుడు గుజరాత్ కి చెందిన విజయ్. హైదరాబాద్ అబిడ్స్ జగదీష్ మార్కెట్ కి చెందిన వ్యాపారికి వాట్సప్ లో 107 ఐఫోన్లు కావాలంటూ ఆగంతకులు ఆర్డర్ చేసారు. మొబైల్ ఫోన్లు పంపిన అనంతరం డెలివరీ అయ్యాక డబ్బులు ఇస్తామని గుజరాత్ కి చెందిన వ్యక్తులు చెప్పారు. మొదటగా 5 లక్షల విలువైన మె-ుబైల్స్ తీసుకొని డబ్బులు పే చేసి నమ్మించారు. ఎల్ ఆర్ నంబర్ ఆధారంగా పే చేస్తామని నమ్మించారు. డబ్బులు రాకపోవడంతో అబిడ్స్ పోలీసులకు బాధితుడు పిర్యాదు చేసాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసారు. ప్రత్యేక బృదం ఏర్పాటు చేసి గుజరాత్ కి సూరత్ కి చెందిన నిందితుడు ఏ2 నిరావ్ రాజు ను అరెస్ట్ చేసారు. ఏ1 విపుల్ అలియాస్ విజయ్ పరారీ లో ఉన్నాడు. 64 లక్షల విలువ చేసే 102 ఐఫోన్లనె పోలీసులు సీజ్ చేసారు. మరో 5 ఐఫోన్లు నిందితులు విక్రయించారని డిసిపి వెల్లడించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215